# వీధి కుక్కల బెడద లేకుండా చూడండి

## సమీక్షా సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి

సికింద్రాబాద్, ఫిబ్రవరి 14: నగరంలో పురోగతిలో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని నగర డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతా శోభన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో జోనల్ కమిషనర్ రవికిరణ్‌తో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు వీధి కుక్కల బారిన పడుతూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వాటి నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని వెటర్నరీ అధికారులకు సూచించారు. కార్పొరేటర్లందరూ అధికారులకు సహకరిస్తూ వారి వారి డివిజన్లలో అభివృద్ధి పనులను త్వరితగతిన జరిగే విధంగా చూస్తూ ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, జీహెచ్ఎంసీ అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, జోనల్ కమిషనర్

## దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

అడ్డగుట్ట, ఫిబ్రవరి 14 : ఈ నెల 16న తలపెట్టిన భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కోరుతూ సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో తుకారాంగేట్‌లోని లేబర్ అడ్డా వద్ద ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ కార్యదర్శి కాంపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ...అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలను ఆకాశానికి ఎత్తి సామాన్య ప్రజలకు బతుకును భారంగా చేశారని అన్నారు. పెంచిన ధరలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని, వచ్చే ఎన్నికల్లో ప్రజల ఆగ్రహానికి మోదీ గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గౌరీ నాగరాజు, బాబు, యాదగిరి, రంజిత్ సింగ్, శంకరయ్య, రామస్వామి, బాలరాజు, వేణు పాల్గొన్నారు.



**'మరమ్మతులు చేయించండి'**

*ఈ నెల 19న జరగబోయే ఛత్రపతి శివాజీ జయంతిని పురస్కరించుకొని వారాసిగూడలో ఉన్న శివాజీ విగ్రహానికి పరమ్మతులు చేపట్టాలని శివాజీ జయంతి ఉత్సవ సమితి కన్వీనర్ భాస్కర్ గిరి బుధవారం విజ్ఞప్తి చేశారు.*
*– సికింద్రాబాద్, ఫిబ్రవరి 14:*

# ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలి

## బేగంపేట్ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు

కంటోన్మెంట్, ఫిబ్రవరి 14: వాహనాలు అతి వేగంతో నడపటం ఎప్పుడు ప్రమాదకరమేనని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. రహదారులపై క్రమశిక్షణగా వ్యవహరించాలి. బుధవారం జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల సందర్భంగా బోయిన్‌పల్లిలోని ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సిబ్బందికి రోడ్డు సేఫ్టీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ ఏసీపీ మాట్లాడుతూ ఎప్పుడు కూడా వాహనం అతి వేగంతో నడపరాదని, ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ట్రాఫిక్ నియమాలను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎయిర్ ఫోర్స్ స్టేషన్ గ్రూప్ కెప్టెన్ మనీష్ కుమార్, చీఫ్ ఇంజినీరింగ్ ఆఫీసర్ ఎస్.శివ కుమార్, బోయిన్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ నాగయ్య, ఎస్.ఐ. విజయకాంత్, కృష్ణ పాల్గొన్నారు.



ఎయిర్ ఫోర్స్ స్టేషన్ సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## నార్త్‌జోన్‌లో ముగ్గురు ఏసీపీల బదిలీ

కంటోన్మెంట్, ఫిబ్రవరి 14: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు హైదరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నార్త్‌జోన్‌లో ముగ్గురు ఏసీపీలు బుధవారం బదిలీ అయ్యారు. బేగంపేట ఏసీపీ రామలింగరాజును డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని చెప్పారు. బేగంపేటకు ఇంటెలిజెన్స్ డీఎస్పీగా ఉన్న గోపాల కృష్ణ మూర్తిని ఏసీపీగా వచ్చారు. తిరుమలగిరి ఏసీపీ శ్రీధర్‌ను సీఐడీ డీఎస్పీగా బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఇంటెలిజెన్స్ డీఎస్పీ రమేష్‌ను తిరుమలగిరి ఏసీపీగా నియమించారు. అదే విధంగా మహంకాళి ఏసీపీ రవీందర్‌ను బదిలీ చేయగా, ఆ స్థానంలో ములుగు డీఎస్పీగా ఉన్న సుభాష్‌బాబును మహంకాళి ఏసీపీగా నియమించారు.

## అభివృద్ధి పనులకు శ్రీకారం

హిమాయత్‌నగర్, ఫిబ్రవరి 14: ప్రజల సహకారంతోనే సమగ్రమైన ప్రణాళికతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు హిమాయత్‌నగర్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆదేశాల మేరకు బుధవారం సంజయ్‌గాంధీ కాలనీలో రూ.23లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సీసీ రోడ్డు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## 'విద్యారంగ సమస్యలను పరిష్కరించండి'


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థి నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థులు ఎదుర్కొంటున్న వివిధ ఉన్నత విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని వివిధ విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అనంతరం విద్యార్థి నేతలు మాట్లాడుతూ గతేడాది నుంచి నిలిపివేసిన మౌలానా ఆజాద్ నేషనల్ ఫెలోషిప్‌ను పునరుద్ధరించాలని కోరారు. ఓబీసీ, ఎస్సీ, ఎస్టీలకు జాతీయ ఫెలోషిప్‌ల సంఖ్యను పెంచాలని కోరారు. ప్రస్తుతం నేషనల్ ఫెలోషిప్ ఫర్ అదర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (ఎన్ఎఫ్ఓబీసీ)ను కేవలం వెయ్యి మందికి మాత్రమే ఇస్తున్నారని గుర్తు చేశారు. ఎన్ఎఫ్ఎస్సీ, ఎన్ఎఫ్ఎస్టీలను అయిదు వేల సంఖ్యలో ఇవ్వాలన్నారు. ఉన్నత విద్యారంగ సంస్థల్లో డీ రిజర్వేషన్ల ప్రతిపాదనను యూజీసీ వెనక్కి తీసుకోవాలన్నారు. నేషనల్ ఇనిస్టిట్యూట్ ఫర్ ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజేబిలిటీస్ (ఎన్ఐఈపీఐడీ) డైరెక్టర్ నియంత వైఖరికి నిరసనగా అనేకమంది రాజీనామాలు చేశారన్నారు. తక్షణమే ఆయనపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు నెల్లి సత్య, లెనిన్, నామ సైదులు, ఆంజనేయులు, హరికృష్ణ, హబీబ్, ధీరజ్, భగత్, అశ్వన్ పాల్గొన్నారు.

## రెడ్ ఫ్లాగ్ గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా మహమ్మద్ కాశీం



ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: మార్క్సిస్ట్ – లెనినిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (ఎంఎల్‌పీఐ) (రెడ్ ఫ్లాగ్) గ్రేటర్ హైదరాబాద్ కార్యదర్శిగా మహమ్మద్ కాశీం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తార్నాకలో మంగళవారం నిర్వహించిన రెడ్ ఫ్లాగ్ గ్రేటర్ హైదరాబాద్ ప్రథమ మహాసభలో కాశీంతో పాటు 11 మందిని నగర కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఇటీవలే కాశీం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా సైతం నియమితులయ్యారు. ఈ సందర్భంగా కాశీం మాట్లాడుతూ దేశంలో మతోన్మాద బీజేపీని ఓడించి ప్రజాస్వామ్యాన్ని నెలకొల్పాలన్నారు.అనంతరం ఆయనను పలువురు అభినందించారు.



## శ్రీజ్ఞాన సరస్వతి ఆలయంలో అక్షరభ్యాసం

*వసంత పంచమి సందర్భంగా బుధవారం న్యూబోయిగూడలోని శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరభ్యాసం నిర్వహించారు. ఆలయ ధర్మాధికారి కళా వీఎస్. జనార్దన మూర్తి పర్యవేక్షణలో ఆలయానికి వచ్చిన భక్తులు సరస్వతి హోమంలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.*
*బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 14 :*

## ఓయూ ఏసీపీగా గ్యార జగన్



ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: ఉస్మానియా యూనివర్సిటీ డివిజన్ ఏసీపీగా గ్యార జగన్ నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా పోలీసు అధికారుల బదిలీలో భాగంగా జగన్ ఓయూ ఏసీపీగా బదిలీ అయ్యారు. ఆయన ప్రస్తుతం అంబర్‌పేట పీటీసీలో ఏసీపీగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఆయన ఓయూ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసి ఫ్రెండ్లీ సీఐగా పేరు తెచ్చుకున్నారు. ఇంతకుముందు ఆయన బేగంపేట, కీసర, బొల్లారం స్టేషన్లలో ఇన్‌స్పెక్టర్‌గా పనిచేశారు. ఈ సందర్భంగా ఆయనను పలువురు విద్యార్థి నాయకులు అభినందించారు.

## 'బల్బు' ప్యానెల్ విజయం

*ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ రైల్వే ఎంప్లాయీస్ అసోసియేషన్ ఎలక్ట్రికల్ బ్రాంచ్ లాలాగూడ రైల్వే ఉద్యోగుల మధ్య జరిగిన ఎన్నికల్లో బల్బు ప్యానల్ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందారు. ఉత్కంఠ భరితంగా జరిగిన పోటీల్లో బల్బు ప్యానల్‌కు సంబంధించిన అభ్యర్థులు విజయాన్ని సాధించారు. అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు, సెక్రెటరీగా హరి ప్రసాద్, కోశాధికారిగా స్వతంత్ర అభ్యర్థి ఎస్. శ్రీనివాస రావులు గెలుపొందారు. ఉద్యోగుల సంక్షేమం, భద్రతకు అన్నివిధాలుగా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు వెంకటేశ్వర్లు ఈ సందర్భంగా తెలియజేశారు. – అడ్డగుట్ట, ఫిబ్రవరి 14 :*



## సేవాలాల్ జయంతిని .. సాధారణ సెలవుగా ప్రకటించాలి


ఓయూ ఎన్‌సీసీ గేటు వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీజేపీ ఎస్టీ మోర్చా నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, ఫిబ్రవరి 14: సంత్ సేవాలాల్ జయంతిని ఆప్షనల్ హాలిడే కాకుండా సాధారణ సెలవుగా ప్రకటించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఎస్టీ మోర్చా ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సిటీ ఎన్‌సీసీ గేటు వద్ద బుధవారం నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ప్రభుత్వ వైఖరికి నిరసనగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కళ్యాణ్ నాయక్ మాట్లాడుతూ ఆప్షనల్ హాలిడేగా ప్రకటించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. సేవాలాల్ జయంతి ఫిబ్రవరి 15, గొండు వీరుడు కొమురంభీం జయంతి అక్టోబర్ 22న ప్రభుత్వం సంపూర్ణ సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా భాగ్యనగరం నడిబొడ్డున వారి విగ్రహాలను నెలకొల్పాలని అన్నారు. ఈ విషయంలో వెంటనే అసెంబ్లీలో సీఎం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు.

# వైభవంగా విగ్రహ ప్రాణ ప్రతిష్ట

బొల్లారం,ఫిబ్రవరి 14:కంటోన్మెంట్ బోయిన్‌పల్లి బాపూజీనగర్‌లో ముత్యాలమ్మ ఆలయం ఇటీవల పునర్నిర్మాణం జరిగింది.ఈ నేపథ్యంలో బుధవారం నూతన ఆలయ ప్రాంగణంలో నూతన విగ్రహ ప్రాణ ప్రతిష్ఠాపన,ఆలయ ప్రారంభోత్సవ పూజలు తదితర కార్యక్రమాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ హాజరయ్యారు. సికింద్రాబాద్ మహంకాళి ఆలయం ప్రధాన అర్చకులు బ్రహ్మ శ్రీ వేణుమాధవ శర్మ వేద పండితుల బృందం అమ్మవారిని అలంకరించి పూజలు నిర్వహించారు.అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్,భానుక నర్మద మల్లికార్జున్,బీవీ రెడ్డి,నంద కిశోర్,ఆలయ కమిటీ సభ్యులు నగేష్,నర్సింగ రావు,కొమురయ్య, శ్రీకాంత్, లక్ష్మణ్, మల్లేశ్, సునీల్, శివరాజ్,అనిల్ తదితరులు పాల్గొన్నారు.


బాపూజీ నగర్‌లోని ముత్యాలమ్మ ఆలయంలో విగ్రహ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్,బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్

## తప్పిపోయిన యువతి తల్లిదండ్రుల చెంతకు..

బేగంపేట్, ఫిబ్రవరి 14 : మానసిక స్థితి సరిగా లేని యువతి ఇంటి నుంచి బయటకు వెళ్లి అదృశ్యం కాగా రాంగోపాల్‌పేట్ పోలీసులు వెతికి పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు.

వివరాలు ఇలా ఉన్నాయి.. రాంగోపాల్‌పేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సింధి కాలనీలో నివాసముండే యువతి 3 రోజుల క్రితం ఇంటి నుంచి బయటకు వెళ్లింది. మూడు రోజులైనా ఇంటికి రాకపోవడంతో మంగళవారం కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి 24 గంటల్లో ఛేదించారు. ఉత్తర మండల డీసీపీ రోహిణి ప్రియదర్శిని ఆదేశాల మేరకు మహంకాళి ఏసీపీ బి.రవీందర్ ఆధ్వర్యంలో ఎస్ఐ, సిబ్బంది రంగంలోకి దిగి మహిళను సురక్షితంగా తల్లిదండ్రుల చెంతకు చేర్చారు.



## పేదలకు వైద్యం అందుబాటులో ఉండాలి



ఫ్యామిలీ ఓపీడీ కార్డులను ఆవిష్కరిస్తున్న దృశ్యం

అమీర్‌పేట్, ఫిబ్రవరి 14 : పేదలకు వైద్యం అందుబాటులో ఉండేలా చూడాల్సిన బాధ్యత ప్రైవేట్ ఆసుపత్రులపై ఉందని ప్రముఖ గైనిక్ సర్జన్ డాక్టర్ ఉమా చల్లా పేర్కొన్నారు. బుధవారం అమీర్‌పేట్ డీకే రోడ్డులోని జోయ్ ఆసుపత్రి కొత్తగా ప్రవేశ పెట్టిన ఫ్యామిలీ ఓపీడీ కార్డులను ఆమె ముఖ్యఅతిథిగా విచ్చేసి జోయ్ ఆసుపత్రుల మార్కెటింగ్‌చీఫ్ ప్రియదర్శి సెహగల్, ప్రముఖ గైనిక్ సర్జన్ స్వర్ణలత శ్రీ, ఎస్ఆర్‌నగర్ ఎస్ఐ రవిరాజ్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేద, మధ్య తరగతి ప్రజల వైద్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రవేశపెట్టిన కొత్త ఫ్యామిలీ ఓపీడీ కార్డు విధానంతో ఎందరికో లబ్ధి చేకూరుతుందన్నారు.

# వాడివేడిగా సాగిన బోర్డు సమావేశం

## బోర్డు సభ్యుడిపై ఆగ్రహం వ్యక్తం చేసిన సీఈఓ.. పలు తీర్మానాలకు బోర్డు ఆమోదం

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు సమావేశం బుధవారం వాడివేడిగా సాగింది. అక్రమ నిర్మాణదారులకు జారీ చేసే నోటీసుల విషయంలో ప్రతిసారి బోర్డు అనుమతి తీసుకోవాల్సిందేనంటూ బోర్డు సభ్యుడు రామకృష్ణ పట్టుబట్టడంతో సీఈఓ మధుకర్ నాయక్ తీవ్రస్థాయిలో ప్రతి స్పందించారు. దీంతో రామకృష్ణ వెనక్కి తగ్గడంతో తదుపరి సమావేశం సజావుగా సాగింది. బోర్డు అధ్యక్షుడు బ్రిగేడియర్ సోమ శంకర్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోర్డు సమావేశంలో సీఈఓ మధుకర్ నాయక్, బోర్డు సభ్యుడు రామకృష్ణ, జాయింట్ సీఈఓ ఆకాశ్ కుమార్ శర్మ, బోర్డు అధికారులు పాల్గొన్నారు.

**బోర్డు సభ్యుడిపై సీఈఓ ఆగ్రహం**

అక్రమ నిర్మాణాలకు సంబంధించి జారీ చేసే సెక్షన్ 248 నోటీసుతో పాటే తదనుగుణంగా 30 రోజుల తర్వాత ఇచ్చే సెక్షన్ 320 నోటీసుకు ఒకే సారి బోర్డు ఆమోదం తీసుకునేలా సీఈఓ ప్రతిపాదించారు. అయితే కూల్చివేత నోటీసులకు సైతం ప్రత్యేకంగా బోర్డు ఆమోదం తీసుకోవాల్సిందేనని బోర్డు సభ్యుడు పట్టుబట్టారు. సెక్షన్ 248 నోటీసులను ధిక్కరించిన వారికే, సెక్షన్ 320 నోటీసులు ఇస్తామని, ప్రతీ సారి బోర్డు తీర్మానం వల్ల జాప్యం జరుగుతుందని సీఈఓ వివరించారు. 2010 నుంచీ ఇదే తరహా పద్ధతిని కొనసాగిస్తున్నామని అధ్యక్షుడు సోమశంకర్ సైతం ఉద్ఘాటించారు. అయినప్పటికీ రామకృష్ణ వినకపోవడంతో సీఈఓ ఆగ్రహం వ్యక్తం చేశారు.

**పలు అంశాలపై సుదీర్ఘంగా చర్చ**

బోర్డు సమావేశం ప్రారంభమైన వెంటనే తాగునీటి బిల్లుల పంపిణీ, వసూళ్లకు సంబంధించిన నూతన సాఫ్ట్‌వేర్ వినియోగానికి సంబంధించిన సర్క్యులర్ ఎజెండా అంశంపై చర్చించారు. ఈ మేరకు దేశ వ్యాప్తంగా కంటోన్మెంట్‌లలో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌కు భిన్నంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు ప్రత్యేక సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించాలని నిర్ణయించారు. ఉచిత మంచినీటి పథకం అమలు, మీటర్ల బిగింపు, బస్తీలకు బిల్లుల మినహాయింపులు తదితర అంశాల వల్ల జీహెచ్ఎంసీ పరిధిలో వినియోగిస్తున్న సాఫ్ట్‌వేర్‌నే ఇక్కడా వినియోగించాలని నిర్ణయించారు. అదే విధంగా కంటోన్మెంట్‌లో నూతనంగా వేయనున్న బోర్‌వెల్స్, వినియోగానికి సంబంధించి రూపొందించిన విధి, విధానాల అమలుకు బోర్డు ఆమోదం తెలిపింది.



కంటోన్మెంట్ బోర్డు సమావేశంలో మాట్లాడుతున్న సీఈఓ మధుకర్‌నాయక్

**పదోన్నతులకు బోర్డు ఆమోదం**

మరోవైపు కంటోన్మెంట్ ఇంజినీర్ గోపాలకృష్ణ దాస్, చీఫ్ కంటోన్మెంట్ ప్లానర్ బాలకృష్ణలు మార్చి నెలాఖరున పదవీ విరమణ పొందనున్న నేపథ్యంలో వారి స్థానంలో ఉమా శంకర్, ఫణికుమార్‌లకు పదోన్నతులు కల్పించేందుకు బోర్డు తీర్మానం ఆమోదించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలకు ఎట్టకేలకు మోక్షం లభించింది. తొలి విడతలో 21 మందికి ఉద్యోగాలు కల్పించేందుకు తీర్మానించారు.

# ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయొచ్చు

బన్సీలాల్‌పేట్, ఫిబ్రవరి 14 : పుల్వామాలో భారత సైనికులపై 2019లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమర జవాన్లకు నివాళిగా గాంధీ దవాఖాన సెక్యూరిటీ సిబ్బంది రక్తదానం చేశారు. బుధవారం గాంధీ బ్లడ్‌బ్యాంక్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాజారావు ప్రారంభించారు. ఒక యూనిట్ రక్తంతో నలుగురికి ప్రాణదానం చేయవచ్చుని, గాంధీ దవాఖానకు వచ్చే పేద రోగులకు ఉచితంగానే రక్తం అందజేస్తామన్నారు. ప్రతివ్యక్తి ఏడాదికి నాలుగుసార్లు రక్తదానం చేయవచ్చన్నారు. అనంతరం రక్తదానం చేసిన సిబ్బందికి ప్రశంసాపత్రాలను అందజేశారు. బ్లడ్ బ్యాంక్ ఇన్‌చార్జి డాక్టర్ సత్యరత్న, ఆర్ఎంఓలు బ్రహ్మేశ్వరరావు, యోగేందర్, జీడీఎక్స్ సంస్థ ప్రతినిధి రవికుమార్, చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ శివాజీ, సూపర్‌వైజర్లు శ్రీకాంత్, ఆంజనేయులు, నర్సింహ, జనార్దన్, సుబ్బారావు, లావణ్య, కళ్యాణ్, సెక్యూరిటీ గార్డులు పాల్గొన్నారు.


రక్తదానం చేసిన సెక్యూరిటీ సిబ్బందిని ప్రశంసాపత్రంతో అభినందిస్తున్న డాక్టర్ రాజారావు

**అమర జవాన్లకు నివాళి..**

పుల్వామాలో భారత సైనికులపై 2019లో జరిగిన ఉగ్రవాదుల దాడిలో మృతి చెందిన అమర జవాన్లకు పద్మారావునగర్‌లోని సర్దార్ పటేల్ కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు బుధవారం నివాళులర్పించారు.అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.హేమలత జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ అధికారులు బి.రాజశేఖర్, కే.బాబు, పరిపాలనాధికారి రాహుల్, ఎన్‌సీసీ క్యాడెట్లు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.


ఎస్పీ కాలేజీ ఆవరణలో ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ హేమలత

## 'శ్రీలేఖలు' కవితా సంపుటి ఆవిష్కరణ

ఖైరతాబాద్ : కవి, రచయిత ప్రవీణ్ శ్రీ రచించిన 'శ్రీలేఖలు' కవితా సంపుటిని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య, సినీనటుడు సుమన్ తల్వార్, సినీ గేయరచయిత సిరాశ్రీతో కలిసి సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ.. చైతన్యవంతమైన సమాజ నిర్మాణానికి సాహిత్యం దోహదపడుతుందన్నారు.

